


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




బుధవారం 28-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 232 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## రెండు గిడ్డంగుల్లో భారీ అగ్నిప్రమాదం.. 8 మంది సజీవ దహనం



2 లో

## కుటుంబ కలహాలతో అన్నాచెల్లెళ్ల ఆత్మహత్య



2 లో

## మదర్ ఆఫ్ ఆల్ డీల్స్.. ఇండియా-ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై ప్రధాని మోడీ



2 లో

## ట్రైన్ ఆలస్యంతో ఎంట్రెన్స్ టెస్ట్ మిస్.. విద్యార్థికి రైల్వేశాఖ రూ.9 లక్షల పరిహారం



2 లో

## రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు జగ్గారెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్..



2 లో

## శ్రీనగర్‌లో భారీగా హిమపాతం.. విమాన రాకపోకలకు అంతరాయం



2 లో


## ఏపీలో పిల్లలకు సోషల్ మీడియా బంద్?



2 లో

# పాక్ ఉగ్రవాదాన్ని ఎన్నటికీ సాధారణీకరించలేం

### ఐరాసలో పాకిస్థాన్‌కు భారత్ ఘాటు సమాధానం



2 లో

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): పాక్ ఉగ్రవాదాన్ని ఎన్నటికీ సాధారణీకరించలేం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా భారత్ స్పష్టం చేసింది. పాకిస్తాన్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి భారత శాశ్వత ప్రతినిధి పార్వతనేని హరీష్ స్పందిస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు. గత ఏడాది జరిగిన 'ఆపరేషన్ సిందూర్' గురించి పాక్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. మే 9 వరకు దాడులకు తెగబడతామని బెదిరించిన పాక్ సైన్యం, మే 10న నేరుగా భారత సైన్యానికి ఫోన్ చేసి యుద్ధాన్ని ఆపాలని వేడుకుందనే నిజాన్ని ఆయన గుర్తు చేశారు. భారత ఆపరేషన్ వల్ల పాక్ వైమానిక స్థావరాలు ఎలా ధ్వంసమయ్యాయో సోషల్ మీడియాలో ఉన్న ఫోటోలే సాక్ష్యమని హరీష్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా వాడుకోవడం పాక్‌కు అలవాటుగా మారిందని, కానీ ఉగ్రవాదాన్ని ఎప్పటికీ సాధారణీకరించలేమని ఆయన తేల్చి చెప్పారు.

సింధు జలాల ఒప్పందం పై స్పష్టత.. జమ్మూ కాశ్మీర్‌లో అంతర్భాగమే!

భారత అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకునే హక్కు పాకిస్థాన్‌కు లేదని, జమ్మూ కాశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో విడదీయలేని అంతర్భాగమని హరీష్ పునరుద్ఘాటించారు.

# మేక్ ఇన్ ఇండియాలో మరో మైలురాయి

### విమానాల తయారీకి అదానీ-ఎంబ్రేయర్ ఒప్పందం




2 లో

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): మేక్ ఇన్ ఇండియాలో పౌర విమానయాన రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. విమానాల తయారీకి అదానీ-ఎంబ్రేయర్ కలిసి ఒప్పందం చేసుకున్నాయి. దేశీయంగా విమానాల తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో అదానీ డిఫెన్స్ & ఏరోస్పేస్, బ్రెజిల్‌కు చెందిన ప్రపంచ స్థాయి విమాన తయారీ సంస్థ 'ఎంబ్రేయర్' మంగళవారం ఒక చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు సమక్షంలో న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో, భారతదేశంలో సమగ్ర 'రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్' ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా భారత్‌లో మొట్టమొదటి ప్రైవేట్ రంగ పౌర విమానాల అసెంబ్లీ లైన్ ఏర్పాటు కానుంది.

ఈ ఒప్పందం ప్రకారం, 80 నుండి 146 సీట్ల సామర్థ్యం ఉన్న ఎంబ్రేయర్ వాణిజ్య విమానాలను మన దేశంలోనే అసెంబుల్ చేయడంతో పాటు, విడిభాగాల తయారీ, సరఫరా వ్యవస్థను పటిష్టం చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆత్మనిర్భర్ భారత్' - 'ఉడాన్' పథకాలకు మద్దతుగా ఈ ప్రాజెక్ట్ సాగనుంది.

# సిగరెట్ లైటర్ కోసం గొడవ..

# ఫ్రెండ్‌ను కారుతో గుద్ది హతమార్చిన వ్యక్తి



న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): సిగరెట్ లైటర్ కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. మరొకరి నాలుక తెగి, తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా కమ్మసంద్రలో ఈ దారుణ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని కమ్మసంద్రలో క్రికెట్ పోటీలకు ఇద్దరు స్నేహితులు ప్రశాంత్ (35), రోషన్ హెగ్డే వెళ్లారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇద్దరు మద్యం సేవించారు. ఈ క్రమంలో స్నేహితులు ఇద్దరి మధ్య సిగరెట్ లైటర్ విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ ముదరడంతో బీర్ బాటిళ్లతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రోషన్ హెగ్డే నాలుకకు తీవ్రగాయమైంది.

తీవ్ర గాయాలు కావడంతో భయపడిపోయిన రోషన్ తన కారులో అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. కానీ ప్రశాంత్ అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. కారు డోర్ పట్టుకుని అడ్డగించేందుకు చూశాడు. దీంతో ప్రశాంత్‌ను అలాగే కారుతో ఈడ్చుకెళ్లి వేగంగా చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రశాంత్ మృతికి కారణమైన రోషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోషన్ నాలుక తెగిపోవడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో అతనికి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ గొడవకు సంబంధించిన దృశ్యాలు కారు డ్యాష్‌బోర్డు కెమెరాలో రికార్డయ్యాయి.

# రేవంత్ రెడ్డికి సైతం సంతోష్ రావు

### తెలంగాణ జాగృతి చీఫ్ కవిత తీవ్ర ఆరోపణలు




2 లో

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులకు తిరిగి వెపన్స్ ఇవ్వాలని తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితని ఆమె కుటుంబ సభ్యులను అడిగి పరామర్శించారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, నేరగాళ్లు విచ్చలవిడితనంగా రెచ్చిపోతున్నారని ఆరోపించారు.

# సాదాబైనామాలకు సడలింపులు..!

# 'సమ్మతి' నిబంధన తొలగించే చాన్స్




న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం )

- 'విక్రయదారుడి సమ్మతి' షరతు తొలగించే యోచన
- 9 లక్షల అప్లికేషన్లకు మోక్షం కలిగే అవకాశం
- కఠిన గైడ్‌లైన్స్‌తోనే క్లియరెన్స్ ఆగిందా?
- కొంతమంది ఐఏఎస్‌ల నిర్ణయాలే అడ్డంకిగా మారాయా?
- సాదాబైనామాలపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూల స్పందన
- పొషెషన్ ఆధారంగానే క్రమబద్ధీకరణకు సంకేతాలు
- ఏపీలో మరోసారి సాదాబైనామాల క్రమబద్ధీకరణ అవకాశం

మిగతాది 2 లో

రాష్ట్రంలో ఐదేండ్లుగా పెండింగులో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి త్వరలో మార్గం సుగమం కానున్నట్లు తెలుస్తున్నది. భూభారతి చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా కొందరు ఐఏఎస్ అధికారులు అత్యుత్సాహంతో రూపొందించిన కఠిన నిబంధనలను సడలించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ముఖ్యంగా దరఖాస్తుల పరిష్కారానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న 'విక్రయదారుడి అఫిడవిట్ -సమ్మతి' నిబంధనను తొలగించే అవకాశముంది. దీనికి సంబంధించిన ఫైల్ ఇప్పటికే సీసీఎల్ఏ నుంచి న్యాయ శాఖకు చేరినట్లు తెలిసింది. అఫిడవిట్ ఆంక్షలు ఎత్తివేస్తే ఇబ్బందులేం లేవని అక్కడి నుంచి కూడా క్లియరెన్స్ వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఒకటీ రెండు రోజుల్లో గైడ్‌లైన్స్ మారుస్తూ జీవో వచ్చే చాన్స్ ఉంది.

## మరోసారి ఎంపీ ఈటల వర్సెస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి..



2 లో

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మధ్య క్రెడిట్ వార్ హాట్ టాపిక్‌గా మారింది. ఇవాళ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేరెడ్‌మెట్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం చెలరేగింది.

## గురుకుల విద్యార్థిని సంగీత మృతి ఘటన.. ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు




2 లో

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండల పరిధిలోని బోర్లం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని సంగీత ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పాఠశాల ప్రిన్సిపాల్ బాధ్యతారాహిత్యం, ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 28-01-2026

# మరోసారి ఎంపీ ఈటల వర్సెస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి.. పోటాపోటీగా నినాదాలు




న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మధ్య క్రెడిట్ వార్ హాట్ టాపిక్‌గా మారింది. ఇవాళ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేరెడ్‌మెట్ లో రైల్వే అండర్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం చెలరేగింది. తమ పోరాటం కారణంగానే రైల్వే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయగా స్టేజి కింద ఉన్న వారు ఇది రాజకీయ వేదిక కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 'నీకు సబ్జెక్ట్ తెలియకుంటే కూర్చోరాబై' అని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు అక్కడున్న బీజేపీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వైపు భారత్ మాతాకీ జై అంటూ బీజేపీ, మరోవైపు జై తెలంగాణ అంటూ బీఆర్ఎస్ మద్దతుదారులు నినాదాలు చేయడంతో అక్కడ ఒక్కసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. దీంతో ఎంపీ ఈటల కలగజేసుకుని అంతరిని శాంతిపజేశారు.

రెండు వారాల క్రితం సేమ్ సీన్:

కాగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మధ్య రెండు వారాల క్రితం సైతం ఇదే తరహా క్రెడిట్ వార్ నడిచింది. మచ్చబొల్లారంలో రైల్వే అండర్ బ్రిడ్జ్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ అండర్ బ్రిడ్జ్ పనులకు నిధులు తాము తెచ్చామంటే తామే తెచ్చామంటూ ఇరు వర్గాల నేతలు బాహాబాహీకి దిగడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘటన మరువక ముందే తాజాగా ఇప్పుడు మరోసారి సేమ్ సీన్ రిపీట్ కావడం చర్చనీయాశంగా మారింది.

# రేవంత్ రెడ్డికి స్పై సంతోష్ రావు..

## తెలంగాణ జాగృతి చీఫ్ కవిత తీవ్ర ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందని, మహిళా అధికారులకే రక్షణ లేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. నేరస్థులకు చట్టాలన్నా, పోలీసులన్నా భయం లేకుండా పోయిందని మండిపడ్డారు. ఎక్సైజ్ పోలీసులు అంటే గంజాయి సరఫరా చేసేవారికి, స్మగ్లర్లకు అస్సలు భయం లేకుండాపోతోందని అన్నారు. అందుకు నిజామాబాద్ ఘటనే అద్దం పడుతోందని పేర్కొన్నారు.

వెపన్స్ ఉంటేనే భయపడతారు..

నేరగాళ్లను కట్టడి చేయాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులకు ఉన్న ఆయుధాలను తిరిగి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల దగ్గర వెపన్స్ ఉంటేనే స్మగ్లర్లు, అసాంఘిక శక్తులు భయపడతారని ఆమె అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణలో దాడులకు గురవుతున్న అధికారులకు ప్రభుత్వం అండగా నిలవాలని, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయవద్దని కోరారు. తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడటంలో రేవంత్ సర్కార్ తక్షణమే స్పందించి, పోలీసు యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డికి స్పై.. సంతోష్‌రావు

సీఎం రేవంత్ రెడ్డికి సంతోష్ రావు గూఢచారిగా పని చేస్తున్నారని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉద్యమనేత కేసీఆర్‌తో ఉద్యమకారులను కలవనివ్వకుండా చేసిందే అతడని.. ఆ పాపం ఊరికే పోదని అన్నారు. గద్దర్‌లాంటి వాళ్లు ప్రగతిభవన్ గేట్ బయట పడిగాపులు కాయాల్సిన పరిస్థితి కలగుజేసింది అతడేనని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సగం ఇడ్లీ తిన్నారా.. పూర్తిగా ఇడ్లీ తిన్నారా? అన్న సమాచారాన్ని కూడా గుంపు మేస్త్రీకి చేరవేసేది సంతోష్ రావేనని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అతడి గుఢచారిని రేవంత్ రెడ్డి శిక్షిస్తాడని తాను నమ్మడం లేదన్నారు. ఇక సంతోష్‌రావు లాంటి దుర్మార్గుడికి కేటీఆర్, హరీష్ రావు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావడం లేదని కవిత అన్నారు.

# గురుకుల విద్యార్థిని సంగీత మృతి ఘటన.. ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు

మొదటి పేజీ తరువాయి




ఈ ఘటనపై స్పందించిన పోలీసులు ప్రిన్సిపాల్ సునీత, ఆటో డ్రైవర్ కాశీనాథ్‌లపై బీఎన్ఎస్ యాక్ట్ 106 (1) కింద కేసు నమోదు చేశారు. అందులో ప్రిన్సిపాల్ సునీతను ఏ1గా, ఆటో డ్రైవర్ కాశీనాథ్‌ను ఏ2 నిందితుడిగా పేర్కొన్నారు. ఇక ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆస్తులను వ్యక్తిగత పనులకు వాడటమే కాకుండా, చిన్నారి మృతికి కారణమైన ప్రిన్సిపాల్ సునీతపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

అసలేం జరిగిందంటే..?

బోర్లం గురుకుల పాఠశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ఫర్నీచర్‌ను ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సునీత తన ఇంట్లో జరిగిన ఒక ఫంక్షన్ కోసం వాడుకున్నారు. అయితే, ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉండటంతో, ఆ ఫర్నీచర్‌ను తిరిగి స్కూల్‌కు తరలించేందుకు ఆమె విద్యార్థినులను వాడుకున్నారు. ఆటోలో వచ్చిన ఫర్నీచర్‌ను దించిన తర్వాత, నలుగురు విద్యార్థినులు తిరిగి అదే ఆటో ఎక్కారు. ఆ సమయంలో డ్రైవర్ కాశీనాథ్ విద్యార్థినులు సరిగ్గా కూర్చోక ముందే ఆటోను ఒక్కసారిగా స్టార్ట్ చేసి వేగంగా ముందుకు తీసుకెళ్లాడు. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థినులు ఆపమని కేకలు వేసినా డ్రైవర్ వినలేదు. ప్రాణభయంతో నలుగురు విద్యార్థినులు ఆటోలో నుంచి బయటకు దూకేశారు. ఈ క్రమంలో సంగీత అనే విద్యార్థిని తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతురాలి బంధువులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు జగ్గారెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్..

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): సంగారెడ్డి జిల్లా కందిలో కొనసాగుతున్న జిల్లా రిజిస్ట్రార్ అలాగే సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పటాన్ చెరుకు తరలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హెచ్చరించారు. పటాన్ చెరు మండలం కర్దనూర్ వద్ద ఇంటిగ్రేటెడ్ ఆఫీసులోకి తరలించే కుట్రలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కార్యాలయాలను పటాన్ చెరుకు ఎలా తరలిస్తారని అధికారులను ప్రశ్నించారు.

తరలింపు నిర్ణయాన్ని అధికారులు తక్షణమే నిర్మించుకోవాలని హెచ్చరించారు. ప్రస్తుతం ఇదే కందిలో కొనసాగుతున్న పటాన్ చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిరభ్యంతరంగా పటాన్ చెరుకు తరలించుకు పోవచ్చునని జగ్గారెడ్డి సూచించారు. అంతే కానీ సంగారెడ్డి జిల్లా కార్యాలయాలు ఎలా..? ఎందుకు తరలిస్తారని ప్రశ్నించారు. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో తాను స్వయంగా మాట్లాడే వరకు ఎలాంటి తరలింపు ఆలోచన చేయవద్దని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఇది తన హెచ్చరికలా చూడాలన్నారు.

# రెండు గిడ్డంగుల్లో భారీ అగ్నిప్రమాదం.. 8 మంది సజీవ దహనం

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): రెండు గిడ్డంగుల్లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఎనిమిది మంది సజీవ దహనంఅయ్యారు. ఈ షాకింగ్ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా, నజీరాబాద్ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కాగా ఈ భారీ అగ్నిప్రమాదం పెను విషాదాన్ని నింపింది. మొదట మామూలుగా చెలరేగిన మంటలు.. పక్కపక్కనే ఉన్న రెండు గిడ్డంగుల(ఒకటి ప్రముఖ మోమో తయారీ కేంద్రం, మరొకటి డెకరేటర్ గిడ్డంగి)లకు పాకాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ నిద్రిస్తున్న ఎనిమిది మంది కార్మికులు సజీవ దహనమయ్యారు.

మంటలు దాదాపు 24 గంటల తర్వాత కూడా కొన్ని ప్రాంతాల్లో రగులుతూనే ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇప్పటివరకు ఎనిమిది మృతదేహాలను వెలికితీసిన అధికారులు, మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వాటి గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహించనున్నారు. లోపల గాలి వెళ్లే మార్గం లేకపోవడం, ప్రధాన ద్వారానికి తాళం వేసి ఉండటంతో కార్మికులు బయటకు రాలేకపోయారని తెలుస్తోంది.

కొనసాగుతున్న గాలింపు చర్యలు.. పెరుగుతున్న మృతుల సంఖ్య

ప్రమాదం జరిగిన సమయంలో గిడ్డంగుల లోపల సుమారు 20 మందికి పైగా ఉన్నట్టు కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 16 మంది గల్లంతైనట్లు ఫిర్యాదులు అందటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. సుమారు 12 అగ్నిమాపక యంత్రాలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, శిథిలాల నుంచి ఇంకా దట్టమైన పొగ వస్తుంది.

ఈ కారణంగా సహాయక బృందాలు లోపలికి వెళ్లడం కష్టతరమవడంతో కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ బృందాలు గోడలను పగలగొట్టి పొగను బయటకు పంపుతున్నాయి. బాధితులంతా పూర్బా మేదినీపూర్, పశ్చిమ మేదినీపూర్ జిల్లాలకు చెందిన వలస కార్మికులుగా గుర్తించారు. ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించగా, అగ్ని ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# కుటుంబ కలహాలతో అన్నాచెల్లెళ్ల ఆత్మహత్య

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): కుటుంబ కలహాలతో అన్నాచెల్లెళ్ల ఆత్మహత్య చేసుకోవడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ షాకింగ్ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాలో నెలకొంది. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెందిన అన్నాచెల్లెళ్లు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బబేరు సర్కిల్ పరిధిలోని బర్చా వంతెనకు సమీపంలో ఉన్న బగై నది ఒడ్డున ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం నది తీరంలో ఒక యువకుడు, యువతి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానిక రైతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే వారు మరణించినట్లు బబేరు సర్కిల్ ఆఫీసర్ సౌరభ్ సింగ్ తెలిపారు. ప్రాథమిక విచారణలో కుటుంబంలో జరిగిన గొడవలే వీరి ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు తెలుస్తోంది. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కసారిగా అన్నచెల్లెళ్లిద్దరూ విగత జీవులుగా పడి ఉండటంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మేక్ ఇన్ ఇండియాలో మరో మైలురాయి

## విమానాల తయారీకి అదానీ-ఎంబ్రేయర్ ఒప్పందం

మొదటి పేజీ తరువాయి


తద్వారా టైర్-2, టైర్-3 నగరాల మధ్య విమాన అనుసంధానం మెరుగుపడటమే కాకుండా, విదేశాల నుండి విమానాల దిగుమతిపై ఆధారపడటం తగ్గుతుంది. రాబోయే 20 ఏళ్లలో భారతదేశానికి 150 సీట్ల లోపు కేటగిరీలో కనీసం 500 కొత్త విమానాలు అవసరమని అంచనా, ఆ డిమాండ్‌ను ఈ భాగస్వామ్యం ద్వారా దేశీయంగానే తీర్చనున్నారు.

కేవలం విమానాల తయారీకే పరిమితం కాకుండా, విమానాల నిర్వహణ , విడిభాగాల ఉత్పత్తి, పైలట్ శిక్షణ వంటి రంగాల్లోనూ ఈ రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల విమానయాన రంగంలో వేలాది మందికి ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎంబ్రేయర్ సంస్థకు ఇప్పటికే భారతదేశంలో మంచి పట్టు ఉంది. భారత వైమానిక దళం, స్టార్ ఎయిర్ వంటి సంస్థలు ఈ కంపెనీ విమానాలను వాడుతున్నాయి. ఈ కొత్త ఒప్పందం భారత్-బ్రెజిల్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, భారత విమానయాన రంగం గ్లోబల్ హబ్‌గా ఎదగడానికి దోహదపడుతుందని అదానీ డిఫెన్స్ డైరెక్టర్ జీత్ అదానీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్.. ఇండియా-ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై ప్రధాని మోడీ

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): త్వరలో ప్రపంచంలోనే భారత దేశం అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంగా అవతరించబోతున్నదని ప్రధాని నరేంద్ర మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ దశాబ్దం చివరి నాటికి చమురు, గ్యాస్ రంగంలో 100 బిలియన డాలర్ల పెట్టుబడే లక్ష్యం అని చెప్పారు. ఇవాళ ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమంలో మాట్లాడారు. భారత్- ఈయూ వాణిజ్య ఒప్పందంతో తయారీ రంగంలో వృద్ధి సాధిస్తామని తెలిపారు. ఇటీవల సంతకాలు జరిగిన ఇండియా-ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ గా పీఎం అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రపంచంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య భాగస్వామ్యానికి ఒక చక్కటి ఉదాహరణ అన్నారు. ఈ డీల్ తో రెండు ప్రాంతాలలోని ప్రజలు, వ్యాపారాలు, పెట్టుబడిదారులకు అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం దేశంలో తయారీ మరియు సేవలు రెండింటిపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని ఆయన అన్నారు. చమురు మరియు గ్యాస్ రంగంలో పెట్టుబడులను పెంచడానికి భారతదేశం ప్రయత్నాలు చేస్తోందని ప్రధానమంత్రి అన్నారు.

# ట్రైన్ ఆలస్యంతో ఎంట్రెన్స్ టెస్ట్ మిస్.. విద్యార్థికి రైల్వేశాఖ రూ.9 లక్షల పరిహారం



న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): రైల్వే శాఖ నిర్లక్ష్యం ఒక విద్యార్థిని భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిన కేసులో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. రైలు ఆలస్యంగా రావడం వల్ల ప్రవేశ పరీక్ష రాయలేకపోయిన విద్యార్థినికి రూ.9.12 లక్షల భారీ పరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరమ్ భారతీయ రైల్వేను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ లోని బస్తీ జిల్లాకు చెందిన సమృద్ధి అనే విద్యార్థిని 2018లో బీఎస్సీ బయోటెక్నాలజీ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంది. అయితే, పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఆమె 'ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్' రైలు ఎక్కింది. కానీ, ఆ రైలు నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. దీంతో సమృద్ధి ఇన్ టైమ్‌లో పరీక్షా కేంద్రానికి చేరుకోలేక ప్రవేశ పరీక్షకు గైర్హాజరు కావాల్సి వచ్చింది. ఫలితంగా ఆమె ఓ అకాడమిక్ ఇయర్‌ను కోల్పోయింది.

రైల్వే శాఖ సర్వీసు వల్లే తన భవిష్యత్తు దెబ్బతిందని భావించిన విద్యార్థి సమృద్ధి, న్యాయ పోరాటానికి సిద్ధమై వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించింది. సుదీర్ఘ విచారణ అనంతరం, విద్యార్థిని వాదనతో కోర్టు ఏకీభవించింది. 'సూపర్ ఫాస్ట్' రైలు అని పేరు పెట్టి, అదనపు ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చడంలో విఫలం కావడం ముమ్మాటికీ సేవా లోపమేనని కోర్టు కామెంట్ చేసింది. విద్యార్థిని మానసిక వేదనకు, కోల్పోయిన విద్యా సంవత్సరానికి గాను పరిహారంగా రూ.9 లక్షలు, కేసు ఖర్చుల నిమిత్తం రూ.12 వేలు చెల్లించాలని రైల్వే శాఖను వినియోగదారుల కోర్టు ఆదేశించింది.

# శ్రీనగర్‌లో భారీగా హిమపాతం.. విమాన రాకపోకలకు అంతరాయం

న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): గతంలో ఎన్నడూ లేని విధంగా జమ్మూ కాశ్మీర్ లో భారీ హిమపాతం చోటుచేసుకుంటుంది. దీంతో ఎక్కడ చూసిన మంచు దుప్పట్లో కొండలు, సరస్సులు, నగరాలు కమ్ముకుని ఉన్నాయి. ఈ క్రమంలో శ్రీనగర్ విమానాశ్రయం పరిధిలో తెల్లవారుజాము నుంచి మరోసారి తేలికపాటి మంచు కురుస్తుండటంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రన్‌వే, విమాన రాకపోకలు సాగించే ఇతర ప్రాంతాల్లో మంచు పేరుకుపోవడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందాలు రన్‌వేను శుభ్రం చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. విమాన కార్యకలాపాలకు అనువైన పరిస్థితులు కల్పించేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన మంచును తొలగిస్తున్నారు.

ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విమానాలు ఆలస్యమయ్యే అవకాశం ఉందని విమానాశ్రయ అధికారులు ప్రయాణికులను హెచ్చరించారు. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు తమ విమాన సమయాల గురించి ఆయా విమానయాన సంస్థలను సంప్రదించి, తాజా సమాచారం తెలుసుకోవాలని శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ అధికారులు సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. వాతావరణం అనుకూలించిన తర్వాతే విమాన సర్వీసులు సాధారణ స్థితికి చేరుకుంటాయని వారు స్పష్టం చేశారు.

# ఏపీలో పిల్లలకు సోషల్ మీడియా బంద్?



న్యూస్ డెస్క్, 27 జనవరి (ఇది కద నిజం ): సోషల్ మీడియా వల్ల మంచి కన్నా చెడు ఎక్కువ జరుగుతుందనేందుకు రోజూ మనం చూసే సంఘటనలే ఉదాహరణ. అడల్ట్ కంటెంట్ కూడా విచ్చలవిడిగా పెరిగిపోయింది. సోషల్ మీడియా యాప్స్ లో వాటిపై బ్యాన్ లేకపోవడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో మైనర్లు సోషల్ మీడియా వాడకుండా ఇప్పటికే కొన్నిదేశాలు నిషేధం విధించాయి. తాజాగా ఏపీలో కూడా పిల్లలకు సోషల్ మీడియా నిషేధం విధించే యోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

గతవారం దావోస్ పర్యటనకు వెళ్లిన ఐటీ శాఖమంత్రి నారా లోకేష్.. దీనిపై తన అభిప్రాయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధించేలా.. ఆరోగ్యం, భద్రత కోసం ఆస్ట్రేలియా అమలు చేస్తోన్న అండర్ - 16 చట్టంపై అధ్యయనం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన రాష్ట్రంలో అమలైతే.. ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ వంటి యాప్స్ వాడకంపై కఠిన ఆంక్షలు అమలయ్యే ఛాన్సుంది. నిబంధనలు పాటించని టెక్ సంస్థలపై భారీ జరిమానాలు విధించేలా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోనుంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది.

# సాదాబైనామాలకు సడలింపులు..! 'సమ్మతి' నిబంధన తొలగించే చాన్స్

మొదటి పేజీ తరువాయి

6 నెలల్లో లక్ష కూడా దాటని క్లియరెన్స్...సాదాబైనామాల పరిష్కారానికి భూ భారతిలో సరైన మార్గాలు చూపారు. కానీ కొందరు ఐఏఎస్‌లు గైడ్‌లైన్స్‌లో అనవసర నిబంధనలు పెట్టారు. దీంతో పెండింగులో ఉన్న 9 లక్షల అప్లికేషన్లల్లో లక్ష కూడా క్లియర్ కాలేదు. గైడ్‌లైన్స్ రిలీజ్ చేసి ఆర్నెళ్లు దాటినా.. ఏ జిల్లాలోనూ కనీసం పది శాతం కూడా పరిష్కారం కాలేదు. అమ్మిన వ్యక్తి నుంచి నోటరీ లేదా ఎన్వోసీ తేవాలన్న నిబంధన పెద్ద అడ్డంకిగా మారింది. రెండు, మూడు దశాబ్దాల క్రితం ఎకరం భూమి ధర రూ.వేలల్లో ఉండగా, ఇప్పుడు అది రూ.కోట్లకు చేరింది. ఈ నేపథ్యంలో తాము ఎప్పుడో అమ్మేశామని, తమకు సంబంధం లేదని రాసిచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. 'సంతకం పెడతాం.. కానీ మాకేంటి' అని బేరసారాలు కూడా చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పలువురు తహశీల్దార్లు, ఆర్డీవోలు కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లారు. పలువురు కలెక్టర్లు కూడా సీసీఎల్ఏ దాకా సమాచారాన్ని చేరవేశారు. కానీ గైడ్‌లైన్స్‌లో ఎలా ఉంటే అలాగే చేయాలని కొందరు ఉన్నతాధికారులు సడలింపునకు ససేమిరా అన్నారు.

కొందరు ఐఏఎస్‌ల వల్లే అడ్డంకి.. బీఆర్ఎస్ హయాంలో స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తులను ఆర్వోఆర్-2020లోని నిబంధనల కారణంగా పెండింగులో ఉంచారు. ఆ తర్వాత హైకోర్టు జోక్యంతో అన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. భూ భారతి చట్టంలో పెండింగులోని 9 లక్షల సాదాబైనామా అప్లికేషన్లకు మోక్షం కల్పించేందుకు అవకాశం ఇవ్వాలన్న చర్చ మొదలుకొని నేటి వరకు కొందరు ఐఏఎస్ అధికారులు ఈ క్రమబద్ధీకరణను అడ్డుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలోనే పలుమార్లు సాదాబైనామాల క్రమబద్ధీకరణ జరిగిందని, మరోసారి అవసరం లేదంటూ తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూ భారతి చట్టం అమల్లోకి రాగానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యంతో స్టే ఎత్తేయించారు. ఇక పరిష్కారానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. కానీ ఈ క్రమంలోనే ఆర్వోఆర్-2025 గైడ్‌లైన్స్‌లో 'అమ్మిన వ్యక్తి అఫిడవిట్-సమ్మతి' వంటి అంశాలను కొందరు ఐఏఎస్ అధికారులు చేర్చడంతో పరిష్కారానికి అవి అడ్డంకిగా మారాయి.

సీఎం సానుకూలత...సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, దానికి గల కారణాలను 'దిశ' పలుమార్లు వెలుగులోకి తీసుకొచ్చింది. భూభారతి చట్టానికి అనుగుణంగా రూల్స్ రూపొందించలేదు. దీని ప్రకారం రిజెక్ట్ చేస్తే 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరుగుతుంది. ఈ అప్లికేషన్లల్లో కనీసం 50 శాతమైనా జెన్యూన్‌గా ఉంటాయని తహశీల్దార్లు అంటున్నారు. అంటే 4.50 లక్షల కుటుంబాలకైనా న్యాయం జరుగుతుంది. ఇదిలాగే కొనసాగితే లేదా అప్లికేషన్లను అమ్మిన వ్యక్తి సమ్మతి లేదని కొట్టేస్తే అటు కోర్టుకు వెళ్లే ఆస్కారం కూడా ఉండదు. ఈ విషయాన్ని కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ గైడ్‌లైన్స్‌ను మార్చాలంటే కష్టమంటూ అప్పటి ఐఏఎస్ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. కొన్ని రోజుల క్రితం సాదాబైనామాల క్రమబద్ధీకరణపై సీఎం రేవంత్ రెడ్డి దగ్గర కొందరు రైతు ప్రతినిధులు, రెవెన్యూ చట్టాల నిపుణుల మధ్య అంశం చర్చకు వచ్చింది. ఈ క్రమంలోనే ఆంక్షల పరంపరను ప్రస్తావించారు. దీంతో 'అవును.. నిజమే కదా! ఇన్నేండ్ల తర్వాత అమ్మినట్లు నోటరీ/అఫిడవిట్ ఇవ్వమంటే ఎవరూ ఇవ్వరు. ఇలాగైతే దరఖాస్తులు ఎలా పరిష్కరించగలరు' అని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. అందుకే త్వరలోనే ఆ షరతులను తొలగిస్తూ సర్క్యులర్ వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని సీసీఎల్ఏ వర్గాలు ధ్రువీకరించాయి. ఒకటీ రెండు రోజుల్లో ఈ అంశంపై క్లారిటీ వస్తుందని ఓ ఉన్నతాధికారి 'దిశ'కు వివరించారు.

పొషెషన్‌తోనే క్లియరెన్స్!...ఇప్పటికే దరఖాస్తుదారులు వాళ్ల దగ్గర ఉన్న అన్ని డాక్యుమెంట్లను జత చేశారు. తెల్ల కాగితం మీదనే కొనుగోలు చేశారని స్పష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో సాక్షులను విచారించొచ్చు. సదరు ల్యాండ్‌లో ఎన్నేండ్ల నుంచి పొషెషన్‌లో ఉన్నారనే విషయాన్ని ఇరుగుపొరుగు రైతుల నుంచి తెలుసుకోవచ్చు. ఫిజికల్ పొషెషన్‌లో కొనుగోలుదారుడు ఉంటే పంచనామాతోనే క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేసే అవకాశముంటుంది. అయితే ఫీల్డ్ సర్వేతోనే వాస్తవాలు తెలుస్తాయి. అందుకే మార్చనున్న గైడ్‌లైన్స్‌లో పంచనామాతోనే ఆమోదమో, తిరస్కరణో చేయాలని ఉండే అవకాశం ఉంది. పొషెషన్‌తో రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపడితే 50 శాతానికి పైగానే ఆమోదం పొందే చాన్స్ ఉంటుందని పలువురు తహశీల్దార్లు అభిప్రాయపడుతున్నారు. పైగా నోటీసుల పంచాయతీ కూడా తప్పుతుందంటున్నారు.

ఏపీలో మరోసారి చాన్స్...ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం మరోసారి సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. 2024 జూన్ 15 వరకు సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూముల క్రమబద్ధీకరణకు 2027 డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. చిన్న, సన్నకారు రైతులకు రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చింది. దీంతో ఉచితంగా మ్యుటేషన్ చేయించుకొని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కేందుకు వెసులుబాటు కలిగింది. జారీ చేసిన నోటీసుల ఆధారంగా తహశీల్దార్ ఇరు పక్షాల వాదనలు విని, వారు సమర్పించిన దస్తావేజులు, ఇతర ఆధారాలు, సాక్ష్యాలు పరిశీలిస్తారు. విచారణ పూర్తయ్యాక భూమి విలువను, చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజును నిర్దేశించాలని ఫారం-13ఎలో తహశీల్దార్ రిజిస్ట్రార్‌ను కోరుతారు. భూమి కొనుగోలు చేసిన తేదీ నాటి విలువల ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ ఫీజు నిర్ధారణ చేస్తారు. ఐదు ఎకరాల లోపు ఉంటే ఉచితంగా చేస్తారు.

# యాదగిరిగుట్టలో ఆంజనేయ స్వామికి
# వైభవంగా ఆకుపూజ



ఇది కద నిజం, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామికి అర్చకులు ప్రత్యేకంగా ఆకు పూజను నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం మంగళవారం నాడు స్వామివారికి జరిగే ఈ విశేష పూజను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా విష్ణు పుష్కరిణి ఆవరణలో కొలువై ఉన్న ఆంజనేయ స్వామి వారికి అర్చక బృందం వేదమంత్రాల సాక్షిగా 'మన్య సూక్త' పారాయణం చేస్తూ శాస్త్రోక్తంగా అభిషేకం జరిపారు. అనంతరం స్వామివారికి సింధూరంతో విశేష అలంకరణ చేసి, నానా రకాల సుగంధ ద్రవ్యాలు మరియు పరిమళ భరితమైన పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ముఖ్య ఘట్టమైన ఆకు పూజలో భాగంగా స్వామివారిని తమలపాకులతో అర్చించి, ప్రత్యేక హారతులు సమర్పించారు. ఈ వేడుకలో స్థానిక భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హనుమన్నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.

# యాదాద్రి జిల్లాలో పులి కలకలం
## దత్తాయపల్లిలో దూడపై దాడి



ఇది కద నిజం,తుర్కపల్లి/ యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో పులి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. మండలంలోని దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామ పరిసరాల్లో పులి తిరుగుతోందన్న వార్తలతో రైతులు, గొర్రెల కాపరులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా దత్తాయపల్లికి చెందిన గొట్టే శ్రీశైలం అనే రైతు పశువులను మేపుతుండగా, పులి ఒక్కసారిగా దాడి చేసి ఒక లేగ దూడను పొట్టనబెట్టుకుంది. ఈ ఘటనను కళ్లారా చూసిన రైతు, పశువులు భయంతో అక్కడి నుండి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై తైకొద్దిన్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, రేంజ్ ఆఫీసర్ల బృందం అక్కడకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించింది. పులి కదలికలను కనిపెట్టేందుకు అమలాబాద్ నుండి ప్రత్యేక 'టైగర్ ఫుట్ ట్రాకర్స్' (పులి అడుగుజాడలను గుర్తించే నిపుణులు)ను రప్పించారు. పులి సంచరించిన ఆనవాళ్లను సేకరించడంతో పాటు, నిఘా కోసం అటవీ ప్రాంతంలో సోలార్ సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. పులి సంచారం నేపథ్యంలో అటవీశాఖ మరియు పోలీసు యంత్రాంగం దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామస్థులను అప్రమత్తం చేసింది. రైతులు, కూలీలు పొలం పనులకు వెళ్లేటప్పుడు ఒంటరిగా వెళ్లకూడదని, గుంపులు గుంపులుగా మాత్రమే వెళ్లాలని సూచించారు. చీకటి పడకముందే పనులు ముగించుకుని సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం అటవీశాఖ బృందాలు పులిని పట్టుకునేందుకు లేదా అడవిలోకి పంపేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

# మంత్రులతో ప్రభుత్వ విప్
# బీర్ల అయిలయ్య భేటీ

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రులతో చర్చించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**



ఇది కద నిజం, భువనగిరి జిల్లా: హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల,వృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణ పురోగతి, గంధమల్ల రైతుల సహా పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రులు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# సికింద్రాబాద్‌లో ఘనంగా
## గంగపుత్ర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఇది కద నిజం,సికింద్రాబాద్, జనవరి 27: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తుకారాం గేట్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ తన చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు కైరం కొండ యాదగిరి, ప్రధాన కార్యదర్శి కరెలి రామానుజం నేతృత్వంలో జరిగిన ఈ ఆవిష్కరణలో ఉపాధ్యక్షులు పల్లె బాలయ్య, కార్యదర్శి పెంటం రవి, ప్రచార కార్యదర్శి కుంట యాదగిరి తమ సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మామిండ్ల జగదీష్, అంగలి లక్ష్మి నర్సిములు, గౌటే సురేందర్ మరియు ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సంఘం సభ్యులందరూ ఐకమత్యంతో ఉండి అభివృద్ధి పథంలో నడవాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.

# పాతగుట్టలో వైభవంగా ముగిసిన
# శ్రీ లక్ష్మీనరసింహస్వామి అధ్యయనోత్సవాలు



ఇది కద నిజం,యాదగిరిగుట్ట (పాతగుట్ట): యాదాద్రి భువనగిరి జిల్లాలోని పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో గత కొన్ని రోజులుగా అత్యంత వైభవంగా సాగుతున్న 'అధ్యయనోత్సవాలు' మంగళవారం (తేదీ: 27-01-2026) నాటితో ఘనంగా ముగిశాయి. విశ్వావసు నామ సంవత్సర మాఘ శుద్ధ షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకొని, ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల ముగింపు రోజైన మంగళవారం స్వామివారికి నిత్యారాధనలు నిర్వహించిన అనంతరం 'పురప్పాట్టు సేవ'ను వైభవంగా జరిపారు. ఇందులో భాగంగా శ్రీ రామానుజాచార్య తిరుమంజనం, ఇరామానుజ నూత్తందాది శాత్తుముర్రై అనుసంధానమును అర్చక బృందం వేదమంత్రాల సాక్షిగా పూర్తి చేశారు. అళ్వారులు తమ పాశురాలలో భగవంతుని దివ్య స్వరూపాన్ని స్తుతించిన రీతిని గుర్తుచేస్తూ, లోక కల్యాణం కోసం భగవద్ అనుగ్రహాన్ని ప్రార్థించడం ఈ అధ్యయనోత్సవాల ప్రత్యేకత అని పండితులు పేర్కొన్నారు.

ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా, ఈ వేడుకల్లో పాల్గొన్న పారాయణదారులను ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ మరియు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె. వినోద్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు, ఉప ప్రధానార్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో ఈ ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. ఈ ముగింపు వేడుకను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# పోలీస్ స్టేషన్ల విభజన ప్రతిపాదనను
## రద్దు చేయాలి: ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు అఖిల పక్షం వినతి



ఇది కద నిజం, సికింద్రాబాద్: తుకారాం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చాలనే ప్రతిపాదనపై అడ్డగుట్ట అఖిల పక్ష నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పు వల్ల స్థానిక ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొంటూ, మంగళవారం సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పరిపాలన సౌలభ్యం పేరుతో ప్రజలకు ఇబ్బంది కలిగించే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అఖిల పక్ష నేతలు ఎస్.యాదగిరి, నక్క మధు, ఆర్.మల్లేష్, నర్సింగ్ రావు, మనోహర్, హంసరాజు, చందర్, శ్రీధర్ గౌడ్, శ్రీరామ్ నాయక్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భౌగోళికంగా మరియు రవాణా పరంగా తుకారాం గేట్ స్టేషన్ పరిధిలోనే ఉండటం తమకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. అఖిల పక్ష నేతల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రజల సౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల పరిరక్షణలో ఇబ్బందులు కలగకుండా తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పోలీసింగ్‌లో సరికొత్త అధ్యాయం
## : బాధితుడి ముంగిటకే ఎఫ్ఐఆర్

**సైబరాబాద్ పోలీసుల వినూత్న చొరవ స్టేషన్ల చుట్టూ తిరిగే పనిలేకుండా ఇంటికే సేవలు**




ఇది కద నిజం:ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేస్తూ, 'ఫ్రెండ్లీ పోలీసింగ్'కు సరికొత్త అర్థం చెబుతున్నారు సైబరాబాద్ పోలీసులు. బాధితులు ఎఫ్ఐఆర్ (FIR) కాపీ కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, పోలీసులే నేరుగా బాధితుల వద్దకు వెళ్లి ఎఫ్ఐఆర్ అందజేసే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు బాలానగర్ పోలీసులు ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

ఘటన వివరాల్లోకి వెళ్తే..

బాలానగర్ పరిధిలోని ఓ పరిశ్రమలో దొంగతనం జరిగినట్లు యజమాని జి. సాంబమూర్తి 'డయల్ 100'కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన బాలానగర్ సీఐ నర్సింహా రాజు, కేసు నమోదు చేయడమే కాకుండా.. స్వయంగా తన సిబ్బందితో కలిసి సదరు పరిశ్రమ వద్దకు వెళ్లారు. బాధితుడికి అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ కాపీని అందజేసి భరోసా కల్పించారు.

"పోలీసులంటే భయం పోగొట్టి, బాధితుల్లో ధైర్యం నింపడమే మా లక్ష్యం. ఇకపై సామాన్యులు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కే పని లేకుండా, సేవలే వారి వద్దకు వస్తాయి." బాలానగర్ సీఐ నర్సింహా రాజు.

ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్, ఏఎస్ఐ హనుమయ్య, హెచ్‌జీ మల్లేష్ పాల్గొన్నారు. పోలీసుల తక్షణ స్పందన మరియు వినూత్న పనితీరుపై బాధితుడు సాంబమూర్తి హర్షం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



# సినిమా న్యూస్



## అనసూయకు గుడి కడతా

### పర్మిషన్ ఇవ్వండి ప్లీజ్ అంటూ పూజారి షాకింగ్ కామెంట్స్

వెండితెరపై, బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అనసూయ భరద్వాజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గ్లామర్ పాత్రలతోనే కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతోనూ మెప్పిస్తున్న ఆమెకు సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ బేస్ ఉంది. అయితే, తాజాగా అనసూయపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ మురళీశర్మ అనే ఒక పూజారి, వీరాభిమాని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆమె పర్మిషన్ ఇస్తే ఏకంగా అనసూయకు గుడి కడతామని ఆయన పేర్కొనడం విశేషం.

ఒక ఇంటర్వ్యూలో మురళీశర్మ మాట్లాడుతూ.. అనసూయ అంటే తనకు అపారమైన గౌరవం అని, గతంలో తమిళనాడులో నటి ఖుష్బూకు గుడి కట్టిన తరహాలోనే అనసూయకు కూడా ఆలయాన్ని నిర్మిస్తామని వెల్లడించారు.. 'దీని కోసం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, అనసూయ గారి అనుమతి కూడా తీసుకుంటాం. ఆమె అంగీకరిస్తే ఆలయ నిర్మాణ పనులు మొదలుపెడతాం' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల చర్చనీయాంశంగా మారిన శివాజీ-అనసూయ వివాదంలో కూడా మురళీశర్మ అనసూయ వ్యాఖ్యలకే తన మద్దతు ప్రకటించారు.

ఒక నటిపై ఉన్న అభిమానంతో ఏకంగా గుడి కడతామని ఓ అభిమాని బహిరంగంగా ప్రకటించడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయ్యింది. మరి ఈ 'గుడి' ప్రతిపాదనపై అనసూయ ఎలా స్పందిస్తుందో చూడాలని నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఇలాంటి విషయాలపై అనసూయ చాలా బోల్డ్‌గా, స్పష్టంగా స్పందిస్తుంటుంది, మరి ఈసారి ఆమె రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

## ఓటీటీలోకి కార్తి కొత్త సినిమా





కార్తీ – కృతిశెట్టి జంటగా నటించిన అన్నగారు వస్తారు (వా వాతియార్) సినిమా ఓటీటీలో విడుదలకు సిద్ధమైంది. తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ, తమిళ భాషల్లో జనవరి 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వెల్లడించింది. ఎన్నో ఒడుదుడుకుల తర్వాత సంక్రాంతికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ఎన్ని కలెక్షన్లు వచ్చాయన్న దానిపై అధికారిక సమాచారం లేదు.

స్టోరీ విషయానికొస్తే.. రెగ్యులర్ స్టోరీ లైన్ గానే కనిపిస్తుంది. దివంగత నటుడు ఎంజీఆర్ కు రాజ్ కిరణ్ వీరాభిమాని. ఆయన మరణించిన రోజునే మనవడు పుట్టడంతో.. ఆయనలాగే పెంచాలని రామేశ్వరన్ (కార్తి) అని పేరు పెట్టుకుంటాడు. నిజాయతీకి మారుపేరుగా పెంచాలనుకుంటే అందుకు భిన్నంగా పెరుగుతాడు. ఎంతో కష్టపడి పోలీసుని చేస్తే.. ఆ అధికారాన్ని దుర్వినియోగం చేసి లంచాలు తీసుకుంటుంటాడు. ఓ సమయంలో ఎన్కౌంటర్ చేయాల్సి రాగా.. అప్పుడు తన మనవడి నిజస్వరూపం రాజ్ కిరణ్ కు తెలుస్తుంది. ఆ బాధతో అతను చనిపోతాడు. తాత మరణం తర్వాత రామేశ్వరన్ ఎలా మారాడు? ఏం జరిగింది? అన్నదే తర్వాతి స్టోరీ.

## దేవర - 2పై నిర్మాత బిగ్ అప్‌డేట్

టాలీవుడ్ లో సింగిల్ టేక్ హీరోగా పేరుతెచ్చుకున్న ఎన్టీఆర్.. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ వరల్డ్ హీరోగా ఎదిగారు. 2024లో దేవర సినిమాతో అభిమానులను ప్రేక్షకులను మెప్పించాడు తారక్. ఈ సినిమా క్లైమాక్స్ లో అసలు దేవర ఏమయ్యాడు అన్న సస్పెన్స్ ఉంటుంది. దాంతా సీక్వెల్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులు వెయిట్ చేస్తున్నారు. తాజాగా.. దేవర-2 పై నిర్మాతల్లో ఒకరైన సుధాకర్ మిక్కిలినేని బిగ్ అప్డేట్ ఇచ్చారు. కొరటాల శివ డైరెక్షన్లో ఈ ఏడాది మే నెల నుంచి దేవర2 సినిమా షూటింగ్ స్టార్ట్ అవుతుందని అనౌన్స్ చేశారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా నందిగామలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్ ను దేవర-2 ఉంటుందా లేదా అని అక్కడికి వచ్చినవారు అడిగారు. దీంతో దేవర 2 కచ్చితంగా తీస్తామని చెప్పారు. మే నెలలో షూటింగ్ మొదలవుతుందని, 2027లో సినిమాను విడుదల చేస్తామని అభిమానుల ముందు ప్రకటించారు. దీంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ నెట్టింట వరుస పోస్టులు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత దేవర -2 షూటింగ్ కు ఎన్టీఆర్ డేట్స్ ఇచ్చే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అంతా బాగుంటా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దేవర-2 ఉంటుందని అభిమానులు అంటున్నారు.





## డ్రీమ్ ప్రాజెక్ట్ పై లోకేష్ కనగరాజ్ కామెంట్స్



తమిళ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతోందన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ ఈ సినిమాను భారీ బడ్జెట్ పై నిర్మిస్తోంది. అయితే ఈ సినిమా లోకేష్ కనగరాజ్ డ్రీమ్ ప్రాజెక్ట్‌గా ప్రచారం పొందుతున్న 'ఇరుంబుకై మాయావి' అని నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌ను మొదట హీరో సూర్యతో చేయాలని ఎప్పటి నుంచో ప్లాన్ చేశాడు లోకేష్. అత్యంత భారీ బడ్జెట్ లో తమిల్ బిగ్గెస్ట్ బడ్జెట్ మూవీగా ఈ సినిమా చేస్తాడని అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. సూర్యకి కథ వినిపించడం అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని కూడా అన్నారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆ కాంబినేషన్ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

ఈ విషయమై లోకేష్ కనకరాజ్ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మీ డ్రీమ్ ప్రాజెక్టును ప్రేక్షకుల అంచనాలతో సంబంధం లేకుండా చేయగలిగితే ఎలాంటి ప్రాజెక్టును ఎంచుకుంటారు అని ప్రశ్నించగా అందుకు బదులిస్తూ నా నెక్స్ట్ సినిమా అలాంటిదే అని బదులిచ్చాడు. దాంతో ఇప్పుడు అల్లు అర్జున్ తో చేస్తున్న సినిమా లోకేష్ కనకరాజ్ డ్రీమ్ ప్రాజెక్ట్ అని వస్తున్న ఊహాగానాలు మరింత బలంగా చేకూర్చాయి. ముఖ్యంగా అల్లు అర్జున్ అభిమానులు, లోకేష్ ప్రస్తుతం పని చేస్తున్న సినిమా అదే 'ఇరుంబుకై మాయావి' అని గట్టిగా నమ్ముతున్నారు. ఈ కాంబినేషన్ నిజమైతే ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ఓ సెన్సేషన్‌గా మారుతుందని చెప్పడంలో సందేహం లేదు. బన్నీ ప్రస్తుతం చేస్తున్న అట్లీ సినిమా సమ్మర్ కి పూర్తి అవుతుంది. ఆ వెంటనే లోకేష్ కనకరాజ్ తో సినిమా సెట్స్ పైకి తీసుకువెళ్లబోతున్నారు. తమ హీరోతో చేయాల్సిన సినిమాను మరొక హీరోతో చేస్తున్నాడని సూర్య ఫ్యాన్స్ ఫీల్ అవుతున్నారు.

## అదిరిపోయిన విజయ్ దేవరకొండ 'రణబాలి' గ్లింప్స్




హీరో విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో వచ్చిన సూపర్ హిట్ ఫిల్మ్ 'టాక్సీవాలా'. ఈ హిట్ కాంబినేషన్ మరోసారి రిపీట్ కాబోతోంది. వీళ్ళ కొత్త సినిమా అధికారికంగా ఖరారవడమే కాదు.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ కు భారీ వ్యూస్ వస్తున్నాయి. అంతేకాదు ఈ వీడియోతో ఈ చిత్ర టైటిల్‌ను కూడా ప్రకటించింది యూనిట్. ఈ పవర్‌ఫుల్ మూవీకి 'రణబాలి' అనే పేరును ఖరారు చేశారు. విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఇది 14వ సినిమా కాగా ఇందులో హీరోయిన్ గా రష్మిక మందాన నటిస్తోంది.

హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వొస్లు కీలక పాత్ర పోషిస్తుండగా.. అజయ-అతుల్ ద్వయం సంగీతం అందిస్తోంది. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని మైత్రీ మేకర్స్, టీ- సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్రిటిష్ కాలంలో జరిగిన కథ, అప్పటి ఆకృత్యాలు, ఆకలి చావులు, వీరోచితంగా ఉన్న విజయ్ గెటప్ సినిమాపై హై ఎక్స్‌పెక్టేషన్స్ పెంచేశాయి.